సాక్షి తిరుపతి

సోమవారం ⁝ 29 ⁝ ఏప్రిల్‌ ⁝ 2024



ఆ రౌడీలను తరిమికొడదాం

తిరుపతిలో వీరంగం సృష్టిస్తున్న చిత్తూరు రౌడీలను తరిమి కొడదామని ఎమ్మెల్యే భూమన పిలుపునిచ్చారు. - 8లో



మౌలిక వసతులు తప్పనిసరి

పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ సిబ్బందిని ఆదేశించారు. - 8లో



ఓటుపై అవగాహన

తిరుపతి జిల్లా స్వీప్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఓటు హక్కుపై నగర వాసులకు అవగాహన కల్పించారు. - 8లో

న్యూస్‌రీల్‌

ప్రతి అంశాన్నీ నమోదు చేయండి



ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న తిరుపతి పార్లమెంట్‌ వ్యయ పరిశీలకులు ప్రదీప్‌కుమార్‌

తిరుపతి అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి ప్రతి అంశాన్నీ రికార్డులో నమోదు చేయాలని తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల ఎక్స్‌పెండేచర్‌ అబ్జర్వర్‌ ప్రదీప్‌కుమార్‌ తెలిపారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి తయారుచేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఎలక్ట్రానిక్‌ మీడియా మానిటరింగ్‌ సెల్‌ కంట్రోల్‌ రూం, సోషల్‌ మీడియా మానిటరింగ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్‌ నియోజకవర్గ అసిస్టెంట్‌ ఎక్స్‌పెండేచర్‌ అబ్జర్వర్‌ కెఎస్‌ఎస్‌.ప్రసాద్‌, డివిజనల్‌ పీఆర్‌ఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల కోడ్‌

తిరుపతి అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమర్థవంతంగా ఎన్నికల కోడ్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. ఇప్పటి వరకు 31,140 రాజకీయ ప్రకటనలు తొలగించినట్లు చెప్పారు. కోడ్‌ ఉల్లంఘించిన 9 మంది కాంట్రాక్ట్‌ ఉద్యోగులను, 11 మంది శాశ్వత ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతోపాటు 17 కేసులు నమోదుచేసినట్లు వెల్లడించారు. 28 మంది వలంటీర్లను తొలగించామన్నారు. రూ.151.65 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, 8686.2 లీటర్ల మద్యాన్ని సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

రెండో దశ ర్యాండమైజేషన్‌ పూర్తి

తిరుపతి అర్బన్‌: ఎన్నికల సిబ్బందికి రెండో దశ ర్యాండమైజేషన్‌ పూర్తయినట్టు కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఆదివారం తిరుపతి కలెక్టరేట్‌లో ఎన్నికల కమిషన్‌ సూచనల మేరకు నిర్దేశిత వెబ్‌సైట్లో పోలింగ్‌ సిబ్బంది రెండో దఫా ర్యాండమైజేషన్‌ ప్రక్రియ సాధారణ ఎన్నికల పరిశీలకులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించిన వారు వారి నియోజకవర్గ నిర్దేశిత శిక్షణ కేంద్రంలో మే 2న శిక్షణకు తప్పక హాజరు కావాలని స్పష్టం చేశారు. డీఆర్వో పెంచలకిషోర్‌, మ్యాన్‌ పవర్‌ మేనేజ్మెంట్‌ అధికారి చంద్రశేఖర్‌ నాయుడు, ఐటీ నోడల్‌ అధికారి వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

తిరుపతి అర్బన్‌: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ సోమవారం చేపట్టనున్నారు. ఆ మేరకు ఆయా పార్టీలకు చెందిన పలువురు నేతలు స్వతంత్రులను విత్‌డ్రా చేయించడానికి తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. జిల్లాలో తిరుపతి పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 227 నామినేషన్లు రాగా.. అందులో 50 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 177 నామినేషన్లు ఆమోదం పొందాయి.



జనంతో కిక్కిరిసిన వెంకటగిరి త్రిభువని కూడలి(ఇన్‌సెట్‌) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి



సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే భుజము తట్టి!

సీఎం జగన్‌కు జేజేలు పలికిన వెంకటగిరి ప్రజలు

- 14 ఏళ్ల బాబు పాలనను ఎండగట్టిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌
- 58 నెలల కాలంలో అమలు చేసిన స్కీమ్‌లను వివరించిన సంక్షేమ ప్రదాత
- మూడు సార్లు సీఎంగా ఉన్నావ్‌.. ఏం చేశావో చెప్పగలవా..? అంటూ ప్రశ్న
- బాబు.. ఓ బాబు అంటూ వెంకటగిరిలో చంద్రబాబు గాలి తీసిన వైనం
- మండుటెండలో మార్మోగిన జగన్నినాదం

భగభగ మండే సూరీడు జగనన్న అభిమానుల జడిలో చిన్నబోయాడు. ఉప్పెనలా తరలి వచ్చిన స్టార్‌క్యాంపెయినర్లకు ఎండతగలకుండా గొడుగు పట్టాడు. చెమట చుక్క చిందకుండా నీడనిచ్చాడు. అభిమాన నేతను చూసేందుకు పరుగుపరుగున వచ్చిన జగనన్న సైన్యానికి జైకొట్టాడు. పెత్తందారులకు కొమ్ముకాసి పేదల ఆశలను వమ్ముచేసిన బాబుపై పంచ్‌ డైలాగులతో విరుచుకుపడుతున్న వైనాన్ని చూసి చిరునవ్వులు చిందిస్తూ సేదతీర్చాడు. మండుటెండలో మార్మోగుతున్న జగన్నినాదాన్ని విని పులకించిపో యాడు. వెంకటగిరి కోటలో ప్రతిధ్వనించిన మెరుగులు దిద్దిన నవరత్న శోభితాన్ని తలచుకుని 'నువ్వే నా నమ్మకం.. మళ్లీ నువ్వే రావాలి జగన్‌' అంటూ నినదించాడు. ఆద్యంతం వెంకటగిరిలో శనివారం జరిగిన సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డి సభ గ్రాండ్‌ సక్సెస్‌ అయ్యింది.



ప్రజలకు ఫ్యాన్‌ గుర్తును చూపుతున్న సీఎం వైఎస్‌ జగన్‌, ప్రచార వాహనంలో పక్కన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రజలు సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పలికారు. ఎన్నికల ప్రచార సభలో ఆయన చంద్రబాబుపై వేసిన పంచ్‌లకు జేజేలు పలికారు. తాను 58 నెలల కాలంలో తెచ్చిన సంక్షేమ పథకాలు.. చేసిన మంచి పనుల గురించి వివరించిన ముఖ్యమంత్రి.. 14 ఏళ్ల పాలనలో బాబు ఎందు చేయలేకపోయావు? అంటూ సంధించిన ప్రశ్నలకు చప్పట్లతో మద్దతు పలికారు. ఆదివారం తిరుపతి పార్లమెంట్‌ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక త్రిభువని కూడలిలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలీకాప్టర్‌ విశ్వోదయ కళాశాల మైదానానికి చేరుకోగానే స్థానికులు త్రిభువని కూడలికి పరుగుపరుగున చేరుకున్నారు. తమ ప్రియతమ నేత సీఎం వైఎస్‌ జగన్‌ని చూసేందుకు ఎర్రటి ఎండలో పరుగులు తీశారు. సీఎం వైఎస్‌ జగన్‌ బస్సుపైకి ఎక్కి స్థానికులకు రెండు చేతులతో అభివాదం చేస్తుంటే.. జగనన్నా.. జగనన్నా అంటూ జనం కేరింతలు కొట్టడం చూస్తే.. మండే సూరీడు సైతం చిన్నబోయాడనిపించింది. సీఎం ప్రసంగానికి ఆద్యంతం జనం చేతులూపుతూ.. జై జగన్‌ అంటూ నినాదాలు చేస్తూ కనిపించారు.

ఆలోచింపజేసిన సీఎం ప్రసంగం

బాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలే పడమేనని.. సినిమాలోని డైలాగ్‌ని చెప్పడం జనాన్ని మెప్పించింది. చంద్రబాబుని నమ్మితే వదల బొమ్మాళి వదలా అంటూ ప్రతి పేదవాడి ఇంటికి వచ్చి తలుపు తట్టి రక్తం తాగేందుకు ఆ పసుపతిని పిలవడమే అని సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి విసిరిన పంచ్‌ డైలాగ్‌లకు జనం కేరింతలు కొట్టారు. ఇంకా చంద్రబాబు అబద్ధాల మేనిఫెస్టోను చూపుతూ అందులోని హామీలను ప్రస్తావిస్తున్నప్పుడు జనం ఫొటోలు తీసుకుంటూ.. చేతులు ఊపుతూ సంక్షేమ ప్రదాతకు జేజేలు పలికారు. 2014 ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీల్లో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేశారా..? అంటూ సీఎం స్థానికలను ప్రశ్నించగా.. లేదు లేదు అంటూ చేతులు ఊపుతూ సీఎంకు సంఘీభావం ప్రకటించారు. ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు డిపాజిట్‌ చేస్తామని హామీ ఇచ్చారని, ఇంటికో ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేశారా..? అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పవర్‌లూమ్‌ రుణాలన్నీ మాఫీ చేస్తానని చేతులెత్తేశారని చెప్పారు.



మళ్లీ నువ్వే రావాలి

సైకిల్‌ బయటే ఉండాలి

అదేవిధంగా కూటమి గుర్తులు చెడు చేసిన సైకిల్‌ ఇంటి బయట ఉండాలని, తాగేసిన టీ గ్లాస్‌ సింక్‌లో ఉండాలి.. మంచి చేసిన ఫ్యాన్‌ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలని చెప్పడంతో జనం అవునన్నా.. అవునే అంటూ బదులివ్వడం కనిపించింది. మంచి వాడు, నాస్నేహితుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌ రెడ్డిని 'రామ్‌'అని సంబోంధించడం, తిరుపతి పార్లమెంట్‌ అభ్యర్థి మద్దిల గురుమూర్తిని నా తమ్ముడు, నా స్నేహితుడు, మంచి వాడు అని స్థానికులకు పరిచయం చేసిన విధానాన్ని వెంకటగిరి ప్రజలు మెచ్చుకున్నారు.



జగనన్నా: ఉప్పొంగిన ఉత్సాహం



మా భవిష్యత్‌ నువ్వే: కేరింతలు కొడుతున్న విద్యార్థులు



మా ధీమా.. ఈ జెండా..



మా భరోసా నువ్వే..

ఆగని ఆరణి దాడులు

- భయభ్రాంతులకు గురవుతున్న తిరుపతి ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆగడాలు
- ఎన్నికల అధికారులు స్పందించాలంటూ స్థానికుల విజ్ఞప్తి

తిరుపతి (అలిపిరి): ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. దీంతో నగర వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గిరిపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరిగిన దాడులు మరువక ముందే ఆదివారం జీవకోనలో ఓ వృద్ధురాలిపై రౌడీ మూకలు దాడికి పాల్పడడం నగర వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. చిత్తూరు నుంచి వచ్చిన రౌడీలు గత వారం రోజులుగా తిరుపతిలోని పలు ప్రైవేటు అపార్ట్‌మెంట్‌లు, లాడ్జీలలో తిష్ట వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రచారానికి పెద్ద ఎత్తున స్పందన రావడంతో దాడులకు యత్నిస్తున్నారు. దీనికి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు ప్రోత్సహించడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాల్సిన తిరుపతి నగరంలో రౌడీ మూకల అల్లర్లతో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎలాగైనా తమ అభ్యర్థిని గెలిపించుకోవాలనే ధోరణితో ధన, అంగ బలాన్ని ఉపయోగించి ఆరణి శ్రీనివాసులు ప్రచారం చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



జీవకోనలో రౌడీమూకల దాడిలో గాయపడిన వృద్ధురాలు

ఆరణికి తగిన గుణపాఠం తప్పదు



రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీకి తిరుపతి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రచారంలోనే ఇంత రౌడీ యిజాన్ని చూపిస్తుంటే.. ఆ పార్టీ నేత గెలిస్తే తిరుపతిని రౌడీరాజ్యంగా చేస్తాడేమో. తిరుపతి ప్రజలు గత రెండు వారాల నుంచి వారి ప్రవర్తన గమనిస్తున్నారు.తిరుపతిలో రౌడీ యిజం ఏంటని విస్తుపోతున్నారు.

– ధనలక్ష్మి, గిరిపురం, తిరుపతి

పింఛన్‌ బ్యాంక్‌ ఖాతాల్లో జమ



ప్రవీణ్‌కుమార్‌, జిల్లా ఎన్నికల అధికారి

తిరుపతి అర్బన్‌: ఏప్రిల్‌కు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్లు మేలో పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. బ్యాంక్‌ అకౌంట్‌ ఉన్న వారికి.. వారి ఖాతాలో నగదు జమ చేస్తారని, బ్యాంక్‌ అకౌంట్‌ లేనివారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తారని తెలిపారు. ఆ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్‌ కమిషనర్లు బ్యాంక్‌ ఖాతాలు లేనివారికి పింఛన్‌ ఇవ్వడానికి ఏప్రిల్‌ 30వ తేదీనే నగదు డ్రా చేసుకోవాలని ఆదేశించారు. మే 1 నుంచి 3వ తేదీ నాటికి 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక నగరంలో చిత్తూరు రౌడీయిజం



“ ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తరఫున ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తుంటే మహిళలని చూడకుండా చిత్తూరు రౌడీలు దాడి చేయడం దారుణం. ఇలాంటి రౌడీ సంస్కృతి ఆధ్యాత్మిక నగరంలో చేయాలనుకోవడం జనసేన పార్టీకి తగదు. గతంలో ఎన్నడూ లేని సంస్కృతిని తిరుపతిలో చూస్తున్నారు. రౌడీ మూకలపై తక్షణం ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాంతమ్మ, గిరిపురం, తిరుపతి

తిరుపతి ప్రశాంతత దెబ్బతింటోంది



జనసేన పార్టీ స్థానికలకు టికెట్‌ ఇవ్వకుండా చిత్తూరు నుంచి దిగుమతి చేసుకుని ప్రశాంత తిరుపతిలో రౌడీయిజాన్ని ప్రేరేపిస్తోంది. ప్రచారం పేరుతో రౌడీలు.. గూండాలు.. తిరుపతి వీధుల్లో తిరగడం స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో.. తెలియని పరిస్థితి. ఇలాంటి రాజకీయాలను తిరుపతి ప్రజలు అంగీకరించరు.

– దేవయాని, తిరుపతి

సహించేది లేదు



తిరుపతిలో రౌడీయిజం.. గూండాయిజం అనే పదాలే తెలియదు. గత పది రోజుల నుంచి ఓటమి భయంతో కూటమి పార్టీకి చెందిన అల్లరి మూకలు నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రౌడీయిజం ..గూండాయిజాన్ని తిరుపతి ప్రజలు క్షమించరు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ప్రచారంలో పాల్గొననీయకుండా అడ్డుకోవాలనే దురుద్దేశంతో ఇలాంటి నీచ రాజకీయాలకు తెరదీశారు.

– ఉదయ వంశీ, తిరుపతి

కార్యకర్తలపై దాడి చేస్తున్నారు



నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తుంటే చిత్తూరు నుంచి వచ్చిన రౌడీ మూకలు దాడికి పాల్పడుతున్నారు. గిరిపురంలో ప్రచారం చేస్తున్న సమయంలో జనసేనకు చెందిన గూండాలు మాపై ప్రచారం చేయొద్దని పిడిగుద్దులు గుద్ది గాయపరిచారు. మాతో పాటు ప్రచారం చేస్తున్న కార్యకర్తలు గాయపడి రుయాలో చికిత్స పొందుతున్నారు. ఇటువంటి ఘటనలు తిరుపతిలో ఎన్నడూ చూడలేదు.

– మనోజ్‌, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు, గాయపడిన వ్యక్తి , గిరిపురం

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడి మృతి


సంజిత్ కుమార్ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని జిలంక మిట్ట వద్ద ఆదివారం అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. బీహార్ రాష్ట్రం, కతిహార్ జిల్లా, బైగ్నా గ్రామానికి చెందిన సంజిత్‌కుమార్ (19) రేణిగుంటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికుడు. ఈ క్రమంలో జింకలమిట్ట సమీపంలో వేప చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి సోదరుడు అమిత్‌కుమార్ తెలిపినట్లు సీఐ చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిత్తూరు రౌడీలను తరిమికొడదాం

- ఆధ్యాత్మిక నగరంలో విధ్వంసాలు సృష్టిస్తున్న కూటమి నేతలు
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికుట్రలు పన్నినా గెలుపు జగనన్నదే
- ప్రతి పేదవాడి ఇంట జగనన్న సంక్షేమ సంతకం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన


ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి


భారీ జనవాహినితో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: 'పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి ప్రజలు చిత్తూరు రౌడీయిజాన్ని కోరుకోవడం లేదు. రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి తిరిగి వారి ఊరికి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్ర ప్రజలను వంచించడానికి, అబద్ధాలతో మోసగించి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో కూటమి ఏర్పడిందే తప్ప ప్రజలకు మంచి చేయాలని కాదు' అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని 30, 37 డివిజన్లలో ఆదివారం కార్పొరేటర్లు కల్పనాయాదవ్, బసవ గీత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతోపాటు మేయర్ డాక్టర్ శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో చిత్తూరు రౌడీలు, అరాచకశక్తులతో పాటు కూటమి నేతలు విధ్వంసాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనంతా పెత్తందారులకు కొమ్ముకాయడానికే సరిపోయిందన్నారు. చంద్రబాబు చిన్నపాటి సంక్షేమాన్ని అందించారని కూటమి నాయకులు ప్రజల్లోకి వచ్చి ధైర్యంగా చెప్పగలరా? అని ప్రశ్నించారు. అదే ఐదేళ్ల జగనన్న పాలనలో పేదల పక్షపాతిగా నిలబడ్డారని చెప్పారు. ప్రతి పేదవాడి ముంగిటకే జగనన్న సంక్షేమాన్ని అందించారని గుర్తుచేశారు. తిరుపతిలో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కూటమి నేతలు చిత్తూరు గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో తన కుమారుడు అభినయ్ చేసిన అభివృద్ధికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో సామన్య, మధ్యతరగతి ప్రజలంతా రాష్ట్రంలో జగనన్నకు, తిరుపతిలో అభినయ్‌కు మద్దతుగా ఉంటారని, మరోసారి వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, బండ్ల చంద్రశేఖర్‌రాయల్, ఇమ్రాన్‌బాషా, బాలసుబ్రమణ్యం, బాలాజీ కోదండ, సుధీర్, నైనారు కేశవ, నైనారు శేఖర్, గల్లా కవిత పాల్గొన్నారు.

గూడూరు ఒకటో వార్డులో టీడీపీకి షాక్

- 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


గూడూరు: సుధాకర్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎల్లసిరి, చేవూరులు

గూడూరు రూరల్: గూడూరు మున్సిపాల్టీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేవూరు విజయమోహన్ రెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి నాశిన నాగులు, వాయిగుండ్ల నాగరాజు, మాజీ కౌన్సిలర్ గిరిబాబు, కోదండయ్య, శ్రీకిరెడ్డి శశిధర్‌రెడ్డి, భాస్కర్, ధనమ్మ, చెంగయ్య పాల్గొన్నారు.

సొంత గూటికి సర్పంచ్ చంద్రకళ


ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో సర్పంచ్ చంద్రకళ

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం సర్పంచ్ చంద్రకళ టీడీపీ నుంచి మళ్లీ వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆదివారం శ్రీకాళహస్తిలో ఆమెకు కండువా వేసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకు చెందిన తనను కొత్తవీరాపురానికి చెందిన టీడీపీ నాయకుడు రాందాసు బూటకపు మాటలు చెప్పి తనకు టీడీపీ కండువా వేశారని చెప్పారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తమకు రాజకీయ భిక్ష పెట్టారని, ఎప్పటికీ వైఎస్సార్‌సీపీని వీడనని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు గాలి గుణశేఖర్ నాయుడు, వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి, ప్రభు, రవిశేఖర్, చంద్ర, చెంగల్‌రాయులు, శ్రీహరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

• మసాలా బొరుగులు

టీ తాగేసి డబ్బులీయకుండా పోతే ఎట్లనా!

- ఎండకు మలమల
- ఓసీగా 'టీ' తాగేస్తే విలవిల

.. అనే లెవెల్లో ఆరణి శ్రీనివాసులు బ్యాచ్ ఝలక్ ఇచ్చేకాడికి ఆ టీకొట్టోళ్లు తెల్లముఖాలేసిరి! ఆదివారం తిరుపతిలో గ్లాసు గుర్తాయన జీవకోన నుంచి ప్రచారం చేసినాడు. టీడీపీ నాయకులు కూడా ట్రిమ్ముగా రెడీ అయి ఆయన ఎనకా ముందూ నడిచినారు. వాళ్లు పైకి నవ్వతా జెనానికి చేతులూపుతా ఉన్నా.. నవ్వినట్లు అనిపిచ్చలా! ఏందిరా ఈ గాచారం అన్నట్లు ముఖాలుండాయే అని జెనాలు అనుకుంట్రి. ఎందిరా సామీ ఈ బాధ? అనుకుంటే.. పోయినతూరి ఎలక్షన్లలో పంక్చరైన 'సైకిల్'కు రిపేరు చేపిచ్చి, ఓవరాయిలింగ్ చేపిచ్చి, స్టాండ్ ఏసి పెట్నారు. చెంద్రన్న ఆ సైకిల్ మీద తిరుపతిలో కొన్ని రౌండ్లు కొట్టి, ఎవరిని సీటు మీద ఎక్కిపిస్తాడా!? అని రోజూ తెల్లారినాక లేస్తానే.. ఉత్తరం పక్క కొండలు చూసి, ఆ శంఖుచక్రాలకు దండం పెడ్తా ఉంటిరి. ఎంకటేసు సామీ.. మాకే సీటిప్పిచ్చు సామీ.. అని మొక్కతా ఉంటిరి. రాత్రయితే పడుకున్నాక 'సీటు' కలలు కంటా ఉంటిరి. అయితే పవను కల్యాణు 'గ్లాస్' తీసుకుని చెంద్రన్నకు చీర్స్ చెప్పేకాడికి సీన్ మారిపాయె! 'తిరుపతోళ్ల సైకిలు'కు ఆయనే సీటు పీకేసి, గ్లాసు పెట్టి, దాని మీద ఆరణిని కూర్చోబెట్టి, రౌండ్లేపిచ్చేకాడికి లబోదిబోమని గుండెలు కొట్టుకుంటిరి.. రిపేరు చేపిచ్చిన సైకిలుకు పంక్చర్ చేస్తామని, హ్యాండిల్‌ఊడబీకుతామని ఓ అని మీడియా ముందు శోకాలు తీస్తిరి. కొందరిది చూడలేక స్పాంజ్‌తో వాళ్ల కళ్లను అద్ది, కన్నీళ్లను గాజు గ్లాసులకు పిండి, చెంద్రన్నకు చూపిచ్చిరి. అయినా చెంద్రన్న మనసు కరగలా. ఆ గ్లాసుల్లోని కన్నీళ్లను మొక్కలకు పోసేసా.



తీసుకో తమ్ముడూ 'గ్లాసు' అంటూ నవ్వతా అక్కడే ఉన్న ఆరణి చేతిలో పెట్నాడు. దీంతో ఖుషీ..ఖుషీగా ఆ గ్లాసు తీస్కొన్న ఆరణి తిరుపతిలో జెనాలకు చూపిస్తా ప్రెచారం మొదలుబెట్టె. తిరుపతి సైకిలోల్లు కూడా ఇక ముఖాలు మాడ్చుకుని తిరగతా ఉండారు. ఇది చూసిన ఆరణన్న వాళ్లకు జెనం ముందు హుషారు తెప్పిచ్చాలని ఓ టీ అంగడికాడ ఆగిపాయె. నేరుగా బోయి రెండు గాజు గ్లాసులు తీస్కొని వేడి..వేడిగా టీ కలిపినాడు. పక్కనే ఉన్న సుగుణమ్మ, ఇంకొంతమంది సైకిలోళ్లకు టీ ఇచ్చేకాడికి గుటకలేస్తా తాగినారు. ఆయన్న మాత్రం లైట్ టీ చేసి చక్కెర కలపకుండా తాగినాడు. ఆడ నుంచి మళ్లీ ప్రచారానికి రోడ్డు మీద పణ్నారు. టీ అంగడోళ్లేమో.. చాలామంది తాగినారు.. గ్లాసు నీదే.. కానీ పాలు, టీ పొడర్ మాదే.. న్నేప్..న్నేప్.. టీకి డబ్బుల్లా!? అని అడగతా ఉన్నా ఎవరూ పట్టించుకోలా..! మ్యాప్..లెక్క రాస్కోపో.. మల్లిస్తాం.. అనేకాడికి.. వీళ్లెప్పుడూ ఓసీ గిరాకీలే అని ధుమధుమలాడిందా టీకొట్టామె!

టీడీపీ జెండా విసిరిపడేసి..


బాలకృష్ణ సభ అనంతరం పేడ కుప్పలో టీడీపీ కండువా, జెండా

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలో బాలకృష్ణ రోడ్‌షోకు వచ్చిన అద్దె కార్యకర్తలు చివరకు జెండాలు విసిరి పడేసి వెళ్లారు.. ఇంతకీ ఏం జరిగిందంటే.. టీడీపీ నాయకుడు, సినీ నటుడు బాలకృష్ణ సూళ్లూరుపేట పట్టణ పర్యటన సందర్భంగా సభ జరిగే ప్రాంతానికి వస్తే రూ.300 డబ్బులు, క్వార్టర్ బాటిల్‌కి అదనంగా డబ్బులు ఇస్తామని చెప్పి టీడీపీ నాయకులు జనాన్ని తరలించారు. ఆ డబ్బులు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్యకర్తలు మెడలో వేసుకున్న కండువా, చేతిలో పట్టుకున్న జెండాను పేడలో విసిరేసి తొక్కేసారు. ఇదిలా ఉంటే సభలో బాలకృష్ణ ప్రసంగంలో ఒక్క ముక్క కూడా అర్థం కాక ఆ పార్టీకి చెందిన వారే విసిగెత్తి వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు


చికిత్స పొందుతున్న రామకృష్ణ

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు గాయపడినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. సీతారాంపేట పంచాయతీ వెంకటాపురానికి చెందిన శ్రీవరం రామకృష్ణ(42) తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి రామకృష్ణ అంజిమేడు సమీపంలోని ఓ పెట్రోలు బంకులో ద్విచక్ర వాహనానికి పెట్రోలు నింపుకుని వెంకటాపురం గ్రామానికి బయలుదేరాడు. ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద వెనుక నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదం తీవ్రంగా గాయపడిన రామకృష్ణను చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మనీ యాప్‌తో మోసం

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు, పునబాక, చావలి, శిరసనంబేడు, నందిమాల గ్రామాలకు చెందిన పలువురు బాధితులు ఆన్‌లైన్ మనీ యాప్‌తో మోసపోయారు. ఈ మేరకు వారు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. గత కొంత కాలంగా ఆన్‌లైన్‌లో మనీ యాప్ ద్వారా రూ.300తో చైన్‌లింక్ అకౌంట్‌లో చేరి వేలకు వేలు సమర్పించారు. కొందరు తిరిగి పొందుతూ వచ్చారు. చివరకు లక్షల్లో నష్టపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో ప్రాంతం నుంచి వందల సంఖ్యలో బాధితులు ఈయాప్‌లో చేరి పూర్తిగా నష్ట పోయారు. దీంతో న్యాయం కోసం పోలీసుల చెంతకు చేరారు. కేసు దర్యాప్తులో ఉంది.

వడదెబ్బకు యువకుడి మృతి

చిల్లకూరు: వడదెబ్బ తగిలి ఓ యువకుడు మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. మండలంలోని కడివేడు రాజ్యలక్ష్మి గిరిజనకాలనీకి చెందిన ఆరూరు లక్ష్మయ్య(24) గ్రామానికి సమీపంలో కంప చెట్లు తొలగింపు పనికి వెళ్లాడు. ఈ క్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా మధ్యలోనే ఇంటికి వచ్చేశాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయగా భార్య కడివేడులోని ఓ ప్రవేటు వైద్యునికి చూపించింది. ఆ తర్వాత ఇంటికి రాగా కొంత సేపటికే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

అయ్యో..చిట్టేటిగుంత!

- టీడీపీ నాయకుడు ఆక్రమణ
- యథేచ్ఛగా భవన నిర్మాణం


టీడీపీ నాయకుడు చిట్టేటిగుంతను ఆక్రమించి నిర్మిస్తున్న నూతన భవనం

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లం రెవెన్యూలోని చిట్టేటిగుంతను ఓ టీడీపీ నాయకుడు ఆక్రమించి యథేచ్ఛగా భవన నిర్మాణాన్ని చేపట్టాడు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. పెనుమల్లం రెవెన్యూలో సర్వే నం.181–1లో 4.84 ఎకరాల విస్తీర్ణంతో చిట్టేటిగుంత ఉంది. ఏళ్ల తరబడి ఈ గుంత నీటిని వివిధ గ్రామాల పశువులు, మేకలు, గొర్రెలు తాగుతుండేది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులు గుంతకు పైభాగం నుంచి వచ్చే వరవ కాల్వను పూడ్చివేశారు. దీంతో చిట్టేటిగుంతకు నీటి రాక ఆగిపోయింది. ఇదేఅదునుగా అప్పట్లో చిట్టేటిగుంత కట్టను పూడ్చుకుంటూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అడ్డుకోవడంతో ఆక్రమణలను కొంత మేర ఆపారు. ఆ తర్వాత గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు చిట్టేటిగుంతను ఆక్రమించి యథేచ్ఛగా నూతన భవన నిర్మాణాన్ని చేపడుతున్నాడు. ఇప్పటికే రెండు ఎకరాల ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు ఆక్రమించారు. ఈ విషయంపై తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజును వివరణ కోరగా ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి


గూడూరులో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

గూడూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గూడూరు పట్టణంలో ఏర్పాటుచేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలతోపాటు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూంలను ఆదివారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన 53–ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాలను పింక్ పోలింగ్ బూత్, సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 39–సాధారణ పోలింగ్ కేంద్రం, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 45– ఆదర్శ విభిన్న ప్రతిభావంతుల పోలింగ్ కేంద్రాలను గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలసి ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గూడూరు నియోజకవర్గంలో పింక్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి రెండో దఫా ర్యాండమైజేషన్ డీఈఓ స్థాయిలో ఆదివారం పూర్తయిందన్నారు. పోలింగ్ సిబ్బందికి మే 2న గూడూరులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అనంతరం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సన్నద్ధపై అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు, డీఎల్‌డీఓ వాణి, తహసీల్దార్లు కరుణ్‌కుమార్, నరసింహారావు, ఎంపీడీఓ రాజశేఖరరావు, పోలీస్ నోడల్ అధికారి పాపారావు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన



ఓటును సద్వినియోగం చేసుకోవాలంటూ అవగాహన కార్యక్రమంలో అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ పార్క్ వద్ద తిరుపతి జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు ఉన్నవారు తప్పక వినియోగించుకోవాలని కోరారు. గత ఎన్నికల గణాంకాలు చూస్తే చదువుకున్నవారు ఎక్కువగా ఉండే తిరుపతి ప్రాంతంలోనే గ్రామీణ ప్రాంతాలకన్నా ఓటింగు శాతం తక్కువగా ఉందన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు, పోలింగ్ స్టేషన్ తదితర వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

మహిళా ఓటర్లే అధికం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు ఓట్ల లెక్క పక్కాగా తేలింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఈ ఏడాది జనవరి 25వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. అయితే అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో ఆయా నియోజకవర్గాల నుంచి కొత్తగా ఓటర్ల నమోదు, ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీనాటికి 18 ఏళ్లు నిండిన అందిరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 14 వరకు ఓటర్‌గా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో జిల్లా ఓటర్లు 18,12,980కి చేరింది. ఇందులో స్త్రీలు 9,29,466 ఉండగా.. పురుషులు 8,83,330 మంది తేలారు. థర్డ్‌జెండర్స్ 184 మంది, పీడబ్ల్యూడీ 24,596 మంది, సర్వీస్ ఓటర్లు 862, యువ ఓటర్లు 42,007, 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులు 7,924 మందిగా నమోదయ్యారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

AUTOMOBILES

RENT / LEASE

■ Toyota Innova Hicross, Petrol Automatic 7 Seater, Yellow Board with Andhra Permit 2023 New Model White Colour for Rental or Lease. if anyone interested Contact: 8712158058.

Education

COACHING

■SA - English Offline Batch (AP-DSC) English Classes by JAN Sir. 40 days. JAN's Academy, Nalgonda. For Details Contact : 70139 43445 (నూతన బ్యాచ్ ప్రారంభం)

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

FLATS FOR SALE

■ Radheshyam Residency, Flat No. 126,3 BHK, East Facing, 1st Floor, Beside Guestline Hotel, Karakambadi Road, Tirupati, ✆ 9398936098.

PLOTS FOR SALE

■తిరుపతి బస్టాండ్ నుండి 9 K.M.లో తాజ్ 5 స్టార్ హోటల్, రాహుల్ కన్వెన్షన్ సెంటర్, తనపల్లి సుబ్రహ్మణ్యం స్వామి టెంపుల్ దాటగానే కమ్మపల్లి దగ్గర వెంటనే ఇల్లు కట్టుకునే Plots & విద్యానగర్ కాలనీ పక్కన L.S.నగర్‌లో కొత్త అపార్ట్‌మెంట్‌లో 2BHK Flats అమ్మబడును. ✆ 9063731718.

TOLET

■ 3 BHK Flat East & West Facing,Vasthu, Cupboards, 24Hrs Water,available for Rent/ Lease,Opp. Guestlinedays Hotel, Bank Employees Colony,Tirupati. 9848226551.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

BUSINESS SERVICE



BUSINESS OFFER

■దుస్తులపై 30% to 50% డిస్కౌంట్ షర్ట్స్, ప్యాంట్స్, నైటీస్, షార్ట్స్‌ని ESSARDI COMPANY తరుపున తయారు చేసి డిస్కౌంట్‌తో మరియు ఆర్డర్‌పై మీరు కోరిన దుస్తులను జాబ్ వర్క్ చేసి అందించగలము. రెడిమేడ్ షాపుల వారు సద్వినియోగం చేసుకోగలరు. ✆ 79978 89555

Wanted

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. తిరుపతిలో పనిచేయుటకు గార్డ్స్ కావలెను. డ్యూటీ, జీతం: 9000–11000. సంప్ర: 8125223207, 7386263700.

■ We are hiring Software Faculty M/F, Q: BE/ME/M.ScCS/MCA,1-2Yrs,Teaching Exp. (Python, Java, Full Stack, Data Analyst) & Mkt Exe.(MBA), 7901238030, 7901238066.

■ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన వారు కావలెను. జీతం: 15 వేలు నుండి 30 వేలు వరకు సంపాదించుకునే అవకాశం కలదు. సంప్ర:9000501618, 9391835409.

■ తిరుపతిలోని బట్టల షోరూం నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ: 14,000/-+4 పీఠ్ అప్ + ESI + EPF కలదు. 9885285899, 9885125899

■ బిజీగా ఉండే VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph:7995365999

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ.18K. Ph: 9640400073 / 9160900024

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9985193111,9573633520.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వవలెను. మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.